సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం । 1 । జనవరి । 2024



సిరిసిల్ల మెహర్‌నగర్‌లో న్యూ ఇయర్ వేడుకలు

న్యూస్‌రీల్

ఆలయాల్లో ప్రభుత్వ విప్ పూజలు



లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటున్న విప్

రుద్రంగి(వేములవాడ): వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం తన స్వ గ్రామం రుద్రంగిలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీనర్సింహ స్వామి, అయ్యప్ప, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, పెద్దమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న నేపథ్యంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్లు వివరించారు. లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్ కొమిరె శంకర్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం, అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే నూతనంగా ఎన్నికైన రుద్రంగి ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ తర్రె ప్రభలత, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): శ్రీరాజరాజేశ్వర (మిడ్‌మానేరు) ప్రాజెక్టు నుంచి కరీంనగర్ ఎల్ఎండీ ప్రాజెక్టులోకి సోమవారం ఉదయం 10 గంటలకు నీటి విడుదల చేయనున్నట్లు మిడ్‌మానేరు ఇంజినిరింగ్ అధికారులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు నుంచి 5 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయనున్న క్రమంలో దిగువన ఉన్న గ్రామాల ప్రజలు, గొర్రెల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రస్తుతం మిడ్‌మానేరు ప్రాజెక్టు ఒక్క గేటు నుంచి 830 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు, ప్రాజెక్టులో 21.64 టీఎంసీల మేర నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

'నలిమెల'కు పురస్కారం



భాస్కర్ దంపతులను సన్మానిస్తున్న ప్రతినిధులు

సిరిసిల్ల: జిల్లాకు చెందిన బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్‌కు సోమనాథ సామాజిక పరిశోధన పురస్కారం లభించింది. పాలకుర్తికి చెందిన సోమనాథ కళాపీఠం ఆదివారం భాస్కర్ దంపతులకు పురస్కారాన్ని అందించారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన భాస్కర్ అధ్యాపకుడిగా వీఆర్ఎస్ తీసుకుని కరీంనగర్‌లో స్థిరపడ్డారు. సోమనాథ సామాజిక పరిశోధన పురస్కారం రావడంపై సిరిసిల్ల రంగినేని ట్రస్ట్ వ్యవస్థాపకుడు రంగినేని మోహన్‌రావు, ప్రముఖ కవులు మద్దికుంట లక్ష్మణ్, ఆడెపు లక్ష్మణ్ అభినందనలు తెలిపారు.

క్రికెట్ చాంపియన్ వేములవాడ



చాంపియన్‌గా నిలిచిన వేములవాడ జట్టు

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీలో వేములవాడ-11 జట్టు విజేతగా నిలిచింది. 15 రోజులుగా 33 టీమ్‌లు పాల్గొనగా, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో టోర్నీ నిర్వహించారు. ఆదివారం ఫైనల్ మ్యాచ్‌ను సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. వేములవాడ జట్టు విన్నర్, సిరిసిల్ల-11 రన్నరప్‌గా నిలిచాయి. విజేత టీమ్‌కు రూ.20వేలు, ట్రోఫీ, రన్నరప్ టీమ్‌కు రూ.10వేల నగదుతో పాటు కప్‌ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, డీసీసీ అధ్యక్షుడు పూర్మాణి రాంలింగారెడ్డి అందించారు.



సిరిసిల్లలోని విద్యానగర్ శ్రీఅభయాంజనేయ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సంబరాలు



బేకరీలో కొనుగోళ్ల సందడి



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో రుమాల్‌రోటీ తయారీ

నయా ఖుషి



సిరిసిల్లటౌన్: పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ జిల్లా కేంద్రంలో ఆదివారం సంబరాలు మిన్నంటాయి. అన్నివర్గాల ప్రజలు హ్యాపీ న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని బేకరీలు, మిఠాయి దుకాణాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. మహిళలు రంగులు కొనడానికి ఉత్సాహం చూపారు. గ్రీటింగ్‌కార్డులు, కేకుల అమ్మకాలతో మార్కెట్‌లో పండుగ వాతావరణం సంతరించుకుంది. ప్రజలు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ చేపట్టిన జోష్‌తో పట్టణంలో సందడి నెలకొంది. అర్ధరాత్రి వరకు వేడుకలు కొనసాగాయి. యువకులు మ్యూజిక్ సిస్టమ్‌లు అరెంజ్ చేసుకుని ఆనందంగా డాన్సులు చేశారు. చికెన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బార్లు, రెస్టారెంట్లు కిటకిటలాడాయి. వేడుకల నిర్వహణపై పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.



వేడుకల్లో ఎస్పీ అఖిల్ మహాజన్, పోలీస్ అధికారులు, సిబ్బంది

యువతా.. మీదే భవిత

- కొత్త సంవత్సరం కావాలి నవ నూతనం
- ప్రథమస్థానం.. ఉత్తమ గమ్యాలే లక్ష్యం
- వ్యాయామమే మహా ఆరోగ్యం
- అవినీతి అంతం.. అదే మన పంతం



కరీంనగర్ అర్బన్: వేడుకగా 2023 సంవత్సరానికి ముగింపు పలుకుతూ.. కొంగొత్త ఆశలతో 2024లోకి అడుగిడాం. గడిచిన ఏడాది పలువురికి విజయాన్ని అందించగా.. మరికొంతమందికి అపజయాలు మిగిల్చింది. వ్యవసాయం పండగని కొందరు యువత నిరూపించగా రాజకీయాల్లో ఎందుకు రాణించలేమంటూ మరికొందరు ఉత్సాహం చూపుతున్నారు. కొలువుల్లో దూకుడు తగ్గని యువత, విద్యాహబ్‌గా పేరున్న కరీంనగర్ పేరు నిలబెడతామని విద్యార్థిలోకం ఉవ్విళ్లూరుతోంది. ఈ నేపథ్యంలో అపజయాలను లెక్క చేయక.. విజయానందాన్ని గర్వించకుండా ముందుకు వెళ్లాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. జ్ఞాపకాలు పదిలం చేసుకొని.. లక్ష్యాలు సాకారం చేసుకొని.. గతేడాదికి వీడ్కోలు చెబుతూ..సరికొత్తగా సాగాల్సిన తరుణమిది. దేశ జనాభాలో అత్యధిక భాగం యువతే కావడం విశేషం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ వారిదే సింహభాగం.

ప్రథమ స్థానమే లక్ష్యం

చేసేవృత్తి, ఎంచుకున్న రంగం, ఉద్యోగం, విద్యార్థి.. యజమాని, శ్రామికుడు.. నాయకుడు, కార్యకర్త ఏదైనా సరే. అందరిలో ఒకటే లక్ష్యం కావాలి. అది ప్రథమస్థానంలో నిలవడం. చేసే పనిలో మనమే ప్రథమంగా నిలవాలనే తపనతో ముందుకు సాగితే విజయం వీడకుండా అంటిపెట్టుకుని ఉంటుంది. అందుకు వర్తమాన అంశాలు, సమాజ స్థితిగతులు, మానవ జీవన విధానంలో చోటు చేసుకుంటున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలి.

ఉత్తమ గమ్యాలు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లే. స్వచ్ఛ భారత్ స్ఫూర్తిగా అనేక కార్యక్రమాలు చేపట్టాం. కరీంనగర్ స్మార్ట్‌సిటీ నేపథ్యంలో ప్రజల పాత్ర కీలకం. నగరంలో రోజుకు 220 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. ఇందులో ప్లాస్టిక్ అత్యధికం. ఇదే కొనసాగితే పర్యావరణం దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వాడకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి ఆచరించడం ఉత్తమం.

వ్యాయామమే మహారోగ్యం

ఆరోగ్యమే మహాభాగ్యం మాట నవనూతనం. ఆరోగ్యకరమైన యువత దేశానికి అవసరం. అందుకే జీవన శైలిలో మార్పులు అత్యవసరం. శారీరక శ్రమ లోపించడంతో ఉబకాయం, బుద్ధిమాంద్యం తలెత్తుతోంది. అమెరికా వంటి దేశాల్లో యువత శరీర బరుగు తగ్గేలా నిరంతరం వ్యాయామం చేస్తుంటారు. శారీరక శ్రమ లేకపోతే మానసిక ఆందోళన పెరుగుతుంది. ఉదయం నడక, వ్యాయామం, యోగా, ధ్యానం వంటివి అలవాటు చేసుకోవడం అనివార్యం. సమయానికి తిండి, నిద్ర ప్రాధాన్యం తెలుసుకుంటే ఉదయం వేళ హుషారు, మానసిక ఉత్తేజం తప్పకుండా లభిస్తుంది.

స్మార్ట్‌గా వ్యవహరిద్దాం

సెల్‌ఫోన్.. ప్రతి వ్యక్తి జీవితంలో కీలకం. మనిషికి సేవ చేసేందుకు వచ్చి శాసిస్తోంది. స్మార్ట్‌ఫోన్‌కు బానిస కాకుండా బాధ్యతగా వినియోగించాలి. ప్రధానంగా సామాజిక మాధ్యమాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి. వివాదాలకు, పుకార్లకు దూరంగా వ్యవహరించాలి. అంతేకాదు చిన్నారులు, యువత సెల్‌ఫోన్‌లో గేమ్‌లకు వ్యసనపరులు కాకుండా చూడాల్సిన బాధ్యత పెద్దలపై ఉంది.

క్షేమంగా గమ్యం

విలువైన ప్రాణం ప్రమాదంలో పోరాదు. అతివేగం.. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్.. వేకువజామున ప్రయాణం.. వీటికి తోడు హెల్మెట్ లేకుండా వాహనం నడపొద్దని ప్రతిజ్ఞ చేసుకోవాలి. గతేడాది ఉమ్మడి జిల్లాలో 200మందికి పైగా మరణించగా 500లకు పైగా గాయపడ్డారు. ఈ సంఘటనలు మనకు ప్రయాణ పాఠం బోధిస్తున్నాయి. జాగ్రత్తగా వ్యవహరిస్తూ క్షేమంగా గమ్యం చేరాలి.

అవినీతి అంతం.. అదే మన పంతం

దేశ ప్రగతికి అవినీతి పెద్ద జాడ్యం. జిల్లాలో ప్రతి ఏటా పదుల సంఖ్యలో అవినీతి నిరోధక శాఖ కేసులు నమోదు చేస్తోంది. అవినీతి అధికారులు, ఉద్యోగుల భరతం పట్టాలి. అప్పుడు రాజ్యాంగం కల్పించిన హక్కులను స్వేచ్ఛగా పొందే అవకాశముంటుంది.

మానవత్వ పరిమళం

మనిషిగా జీవించాలి. స్వార్థం మానవ ఆలోచన వీడాలి. జీవితం నేరపూరితం కారాదు. ఆలోచన విధానం మారాలి. మనతోపాటు పిల్లల్లో చెడు ఆలోచనలకు చోటివ్వకుండా కావాల్సిన జాగ్రత్తలు తీసుకుంటే మనసంతా మానవత్వమే. గతంలో 21హత్యలు, 34అత్యాచార సంఘటనలు చోటుచేసుకున్నాయి. దోపిడీ, మోసాల సంఖ్య చెప్పలేనంతగా నమోదు.. ఇది మనిషి జీవితానికి మచ్చగా పరిగణించాల్సిందే.

ఉపాధికి ఊతం

యువత అత్యధికంగా ఉండటమే కాదు నిరుద్యోగం ఎక్కువే. 2లక్షలకు పైగా ఉద్యోగాల కోసం వేచిచూస్తుంటే.. అర్హతకు తగిన పని లేక దొరికిన దాంతో అసంతృప్తితో కాలం వెళ్లదీస్తున్నారు. పారిశ్రామిక రంగం విస్తరిస్తే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఐటీ హబ్‌గా జిల్లాను మరింత తీర్చిదిద్దాల్సిన అవసరముంది.

ఆత్మహత్య వద్దే వద్దు


ఆత్మహత్య చేసుకునే ధైర్యం ఉంటే ఎంతటి కష్టమైన ఎదుర్కొవచ్చని చెబుతారు. అలాంటప్పుడు ఆ ఆలోచన వద్దు. గత సంవత్సరం వివిధ కారణాలతో 112 మంది ఆత్మహత్యకు పాల్పడటం విచారకరం. ఒక్క క్షణం ఆలోచిస్తే సమస్యకు పరిష్కారం దొరకవచ్చు.

బద్ధకాన్ని జయిద్దాం

ఆ పనా.. వామ్మో నాతో కాదు. ఇది మరీ కష్టంలే. అనే మాటలు వద్దు. అనుకుంటే సాధించలేనిది ఏముంది. చరిత్రను చూస్తే ఎన్నో విజయగాథలు.. పని వాయిదా వేసే దోరణిలో అమూల్యమైన అవకాశాలను చేజార్చుకోవడం చూస్తుంటాం. బద్ధకం వీడితే ఉజ్వల భవిత సొంతం అవుతుందనే ఆశాభావంతో ముందుకెళ్తే తప్పకుండా కొత్త మార్గం కనిపిస్తుంది.

జిల్లాల వారీగా యువత సంఖ్య

కరీంనగర్	3,54,086
రాజన్న సిరిసిల్ల	2,08,422
పెద్దపల్లి	2,25,098
జగిత్యాల	2,34,765



కొత్త ఆశలు.. కొత్త బాసలు

సిరిసిల్ల: కాలగతిలో మరో సంవత్సరం కలిసిపోయింది. గతం మరుపురాని అనుభూతినిస్తుంది. వర్తమానంలో కోటి ఆశలు చిగురిస్తాయి. కొత్త సంవత్సరం.. కొత్త ఆలోచనలు.. కొత్త ప్రణాళికలు.. కొత్త ఆశలు.. ఇలా గతానికి భిన్నంగా కొంతలో కొంతైనా మార్పును ఆశిద్దాం. కొత్త ఏడాదిలో కొత్తగా ఏం చేస్తారని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, భిన్న వర్గాలకు చెందినవారిని ఆదివారం 'సాక్షి' పలకరించగా, వారి అభిప్రాయలను ఇలా పంచుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రధానం



వేములవాడ: కొత్త సంవత్సరం, కొత్త ఆశలతో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరుస్తూ ప్రజా సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతాం. ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయం. గత సంవత్సరం తీపి, చేదు అనుభవాలకు స్వస్తి పలుకుతూ కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలి, సంక్షేమ ఫలాలు అందాలి. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగుండాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నా. వేములవాడను టెంపుల్ సిటీగా మార్చేందుకు నిత్యం కృషి చేస్తా. నియోజకవర్గ, రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు.
– ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమం చేరాలి



అభివృద్ధిలో రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రస్థానంలో ఉండాలి. అందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి. అందుబాటులో ఉన్న నిధులతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా. కొత్త సంవత్సరలలోనూ ప్రజలకు అందుబాటులో ఉంటా. యువత ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలి. మహిళలు సాధికారతను సాధిస్తేనే సమాజంలో మంచి మార్పు వస్తుంది. ఇప్పటికే తొమ్మిదేళ్లుగా జిల్లా పలు రంగాల్లో ముందు వరసలో ఉంది. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ కొత్త సంవత్సరంలోనూ అభివృద్ధి, సంక్షేమం వేగంగా ముందుకు సాగాలని ఆశిస్తాం. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.
– న్యాలకొండ అరుణ, జెడ్పీ చైర్‌పర్సన్

పారదర్శకంగా ప్రభుత్వ పథకాల అమలు



ప్రజాపాలనను సమర్థవంతంగా నిర్వహిస్తాం. జిల్లాలో దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. ఎక్కడా తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. వైద్య రంగంలో మరింత ప్రగతి సాధించే దిశగా ముందుకు సాగుతాం. ఇప్పటికే జిల్లాలో 80 శాతం మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి సేవలు అందిస్తున్నాం. అదే స్ఫూర్తిని కొనసాగిస్తాం. జిల్లాలో ఏడు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వ ఎన్‌క్యాస్ గుర్తింపు లభించింది. మరిన్ని ఆస్పత్రులకు ఆ గుర్తింపు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. విద్యా రంగంపైనా దృష్టి సారిస్తాం. ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లు, గురుకులాల్లో మౌలికవసతులు కల్పిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పథకాలను సమర్థవంతంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు అందిస్తాం.
– అనురాగ్ జయంతి, కలెక్టర్

గంజాయిరహిత జిల్లాగా మార్చుతాం



గంజాయి రహిత జిల్లాగా మార్చుతాం. రాష్ట్ర ముఖ్యమంత్రి డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రం లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. అదే స్ఫూర్తితో జిల్లాలో గంజాయి రవాణా, నిల్వలు, విక్రయాలపై నిఘా ఉంచి కట్టడి చేస్తాం. జిల్లాలో డీ-ఎడిక్షన్ సెంటర్ ప్రారంభిస్తాం. మరోవైపు సైబర్ నేరాలు సవాల్‌గా మారాయి. దేశంలోని సైబర్ నేరాల్లో తెలంగాణలో ఎక్కువగా ఉన్నాయి. ప్రజల్లో దీనిపై చైతన్యం తెచ్చి సైబర్ నేరాలను అరికడుతాం. విజిబుల్ పోలీసింగ్‌కి ప్రాధాన్యతనిస్తూ శాంతిభద్రత పరిరక్షణలో ముందుంటాం. పోలీసులు ప్రజలకు మరింత చేరువయ్యేలా చూస్తాం. నేరాల నియంత్రణకు టెక్నాలజీని వినియోగించుకుంటాం. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.
– అఖిల్ మహాజన్, జిల్లా ఎస్పీ

మంచి పనికి శ్రీకారం చుట్టాలి



సిరిసిల్లటౌన్:కొత్త సంవత్సరం వేళ ప్రతిఒక్కరూ సామాజిక శ్రేయస్సును కాంక్షిస్తూ మంచి పనులకు శ్రీకారం చుట్టాలి. కొత్త ఏడాది పూట సంస్కృతి వెర్రితలలు వేయకుండా చూడాలి. గతంలో బాధలు నెమరువేయకుండా కొత్త ఆలోచనలతో సాగాలి.
– భూక్య వినోద, కేజీబీవీ, ఉపాధ్యాయురాలు

ఆరోగ్యమే మహాభాగ్యం



సిరిసిల్లటౌన్: అందరూ కొత్త సంవత్సరం నుంచైనా ఆరోగ్యశైలిలో మార్పు చేసుకోవాలి. కరోనా వంటి మహమ్మారితో పోరాడినం. యువత చెడు వ్యసనాలను వదిలేయాలి. న్యూ ఇయర్ వేడుకల్లో జంక్‌ఫుడ్‌ను పూర్తిగా నిషేధించాలి. అందరూ ఉత్తమ గమ్యాలను ఎంచుకుని ముందుకు సాగాలి.
– డాక్టర్ దివ్యశ్రీ,

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు



సిరిసిల్లటౌన్: ఉజ్వల భవిష్యత్తుకు యువత, విద్యార్థులు బాటలు వేసుకోవాలి. జీవితంలో అడుగుపెడుతున్న వేళలో ముందుగానే ప్రణాళిక ఉండాలి. అన్ని విషయాల్లో మంచిని గ్రహిస్తూ చెడును వదిలేస్తూ, ఉన్నత లక్ష్యానికి చేరుకోవాలి. స్వప్రయోజనాలకు పోకుండా అందరూ పరోపకారంతో ముందుకు సాగాలి. నేను మాత్రం దృఢనిశ్చయంతో సమాజ హితానికి పాల్పడుతా.
– చొటపెల్లి వేణుగోపాల్, అడ్వకేట్

సంకల్ప బలం గొప్పది



సిరిసిల్లటౌన్: మన జీవితంలో మరో వసంతం గడిచింది. కొత్త సంవత్సరంలో జయాలు కలిగేలా సంకల్పించుకుని ముందుకుసాగాలి. యువతరం బాగుపడాలి, దేశాన్ని బాగు చేయాలి. విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించేలా పట్టుదలతో చదవాలి. ఉన్నత స్థితికి చేరుకునేందుకు మెరుగైన లక్ష్యంతో ముందకెళ్లాలి.
– పోకల సుమన్, యువ వ్యాపారి

విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

- పలువురి వాహనాలు సీజ్

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఆదివారం రాత్రి 7 గంటల నుంచి ప్రారంభించిన తనిఖీల్లో డ్రంకెన్ డ్రైవ్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. సిరిసిల్ల టౌన్ సీఐ ఆధ్వర్యంలో వందలాది వాహనాదారులకు పరీక్షలు నిర్వహించి వాహనాలను నిలిపివేశారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ వాహన తనిఖీలను పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం అధికంగా ఉంటుందని అందుకే వాహనాలను నిలిపి వేయడానికి ఆదేశాలిచ్చినట్లు వెల్లడించారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికేందుకు చిత్తుగా మద్యం తాగి రోడ్లమీదకు రావడం సరికాదన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ ఉపేందర్, ఎస్‌ఐ రాజు, జునైద్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వేములవాడ బ్రిడ్జి వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వచ్చేవారిని నిలువరించి వాహనాలను అదుపులోకి తీసుకున్నారు.

కాళ్ల మీద పడిన వైనం..

మద్యం తాగి వాహనం నడుపుతూ వచ్చిన వ్యక్తిని సిరిసిల్ల అంబేడ్కర్‌చౌక్ వద్ద పోలీసులు నిలువరించారు. వాహనాన్ని సీజ్ చేశారు. దీంతో సదరు వ్యక్తి సీఐ ఉపేందర్ కాళ్ల మీద పడి తన వాహనాన్ని వదిలేయాలని వేడుకున్నాడు. అవసనమైతే గమ్య స్థానానికి చేర్చుతామని, వాహనాలు ఇవ్వమని సీఐ చెప్పడంతో అక్కడున్న మందుబాబాలు ఎవరి ఇళ్లకు వారు చేరుకునే ప్రయత్నాలు చేయడం గమనార్హం.



తనిఖీలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

వేములవాడ: వేములవాడ పట్టణంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్, వాహన తనిఖీల్లో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం రాత్రి పాల్గొన్నారు. ఎక్కడైనా న్యూసెన్స్ జరిగితే 100 డయల్ చేసి తెలియజేయాలని పేర్కొన్నారు. తనిఖీల్లో టౌన్ సీఐ కరుణాకర్, ఎస్సై ప్రశాంత్ రెడ్డి, దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగురెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం

● బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్పూర్‌కు చెందిన మెరుగురెడ్డి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కేటీఆర్‌ సహకారంతో ఆదుకుంటామని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మెరుగురెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ, మెరుగురెడ్డి మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయారన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ పిల్లి రేణుక, నాయకులు కిషన్, నర్సింలు, మోహన్‌రెడ్డి తదితరులున్నారు.


మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఆగయ్య

ఆహ్లాదం.. ఆలస్యం

- మినీట్యాంక్‌బండ్‌ పనులు హుళక్కేనా?
- అర్ధంతరంగా నిలిచిన సుందరీకరణ పనులు
- బోసిపోయి కనిపిస్తున్న చెరువు కట్టలు
- బెంచీలు వేసి చేతులు దులుపుకున్న కాంట్రాక్టర్లు
- ప్రభుత్వం మారడంతో అయోమయం


ఎల్లారెడ్డిపేటలోని గిద్దెచెరువు


'ఇది ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దెచెరువు. మినీట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వంలో రూ.3కోట్లు మంజూరయ్యాయి. అయితే ఈ నిధులతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ చెరువులోకి దిగేందుకు మెట్లు మాత్రమే నిర్మించాడు. చెరువుకట్టపై ప్రజలు కూర్చునేందుకు బెంచీలు, చల్లదనం పంచేందుకు చెట్లు, కట్ట అందంగా కనిపించేందుకు పూలమొక్కలు, ఇతర డిజైన్లు నిర్మించాల్సిన కాంట్రాక్టర్‌ బెంచీలు మాత్రమే వేశాడు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండి కంపుకొడుతున్నాయి'.


'ఇది గంభీరావుపేట మండల కేంద్రంలోని నమాజ్‌ చెరువు. దీనిని మినీట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.5కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌ కట్టపై మట్టి పోసి వదిలేశాడు. సీసీ రోడ్డు వేయాల్సి ఉంది. బెంచీలు, చల్లని నీడనిచ్చే చెట్లు లేవు. పూర్తి నిధులు మంజూరుకాకపోవడంతో కాంట్రాక్టర్‌ మధ్యలోనే చేతులు ఎత్తేశాడు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చెరువు కట్టల సుందరీకరణ, ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు గత ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మాత్రం మధ్యలోనే వదిలేశారు. పూర్తిస్థాయిలో నిధులు మంజూరుకాకపోవడం ప్రధాన కారణం కాగా.. అధికారుల పర్యవేక్షణ లోపం ప్రజలకు సాయంత్రం వేళ కనీసం ఆహ్లాదం కరువైంది. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట గిద్దెచెరువు, గంభీరావుపేట నమాజ్‌చెరువు, ముస్తాబాద్‌ పెద్దచెరువు, వేములవాడ గుడిచెరువులను మినీట్యాంక్‌బండ్‌లు గా ఆధునీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిషన్‌ భగీరథ పథకం నుంచి ఒక్కో చెరువు అభివృద్ధికి రూ.3.50కోట్ల నుంచి రూ.5కోట్ల వరకు కేటాయించింది. పూర్తి స్థాయిలో నిధులు మంజూరుకాకపోవడంతో వచ్చిన డబ్బులతోనే కాంట్రాక్టర్లు పనులు చేసి చేతులు దులుపుకున్నారు.

సుందరీకరణ పనులు ఇలా..

చెరువుల సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వం మొదటి విడతలో జిల్లాలోని నాలుగు చెరువులను ఎంపిక చేసింది. ఆయా చెరువుల కట్టలను బలోపేతం చేయడం, ప్రజలు కూర్చునేందుకు వీలుగా బెంచీల ఏర్పాటు, చల్లని గాలి వచ్చేలా చెట్లను పెంచడం, పూలమొక్కల ఏర్పాటు, ఆడపడుచులు బతుకమ్మలు వేసేందుకు చెరువులోకి దిగే వీలుగా ఉండేందుకు మెట్లు నిర్మించడం, చెరువుకట్ట ఇరువైపులా రక్షణగా ఫెన్సింగ్, ప్రతీ చెరువులో బోటింగ్‌ ఏర్పాటు చేయాలి.

బోసిపోయిన చెరువులు

చెరువులను మినీట్యాంక్‌బండ్‌లుగా మార్చి ప్రజలు ఆహ్లాదంగా సేద తీరేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ సంకల్పం నీరుగారిపోయింది. అనుకున్న లక్ష్యం ప్రకారం రెండేళ్లలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని నిర్ణయించగా.. ఎక్కడ కూడా పనులు పూర్తయిన దాఖలాలు లేవు. ఉదాహరణకు.. గంభీరావుపేట నమాజ్‌ చెరువుకట్టపై సైడ్‌బర్మ్స్‌ నిర్మించి వదిలేశారు. కట్టపై కనీసం సీసీ రోడ్డు వేయలేదు. బతుకమ్మ ఘాట్లు నిర్మించి చేతులు దులుపుకున్నారు. ముస్తాబాద్‌ పెద్దచెరువు వద్ద కట్టపై బెంచీలు వేశారు. సీసీ వేయగా, ఆరు నెలల్లోపే పగుళ్లు చూపింది. ఇక్కడ కూడా సగం పనులు చేసి వదిలేశారు. ఎల్లారెడ్డిపేటలోని గిద్దెచెరువు సుందరీకరణలో కట్టపై కొంతదూరం రక్షణగా ఫెన్సింగ్‌ వేశారు. బతుకమ్మలు వేయడానికి మెట్లు, పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయని కారణంగానే సుందరీకరణ పనులు పూర్తికాలేదని కాంట్రాక్టర్‌ల మాట. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఇప్పుడిప్పుడే పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఆహ్లాదంపై ప్రజలు పెంచుకున్న ఆశలు ఆవిరయ్యాయి.

పనులు పూర్తి చేయాలి


ఏళ్ల తరబడి ట్యాంక్‌బండ్‌ పనులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ప్రజలకు ఆహ్లాదం పంచడంతోపాటు చెరువుకట్ట బలోపేతానికి చేపట్టిన చర్యలు గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తిగా ఉన్నాయి. కొత్త ప్రభుత్వమైనా స్పందించి పనులు పూర్తి చేయాలి.

– దోసల చంద్రం, గంభీరావుపేట

నిధులు మంజూరు చేయాలి


ఎల్లారెడ్డిపేటలోని గిద్దెచెరువును సుందరీకరించడానికి గత ప్రభుత్వం రూ.3కోట్ల అంచనాలతో నిధులు మంజూరు చేసింది. నిధులు సరిపోక కాంట్రాక్టర్‌ పనులను మధ్యలోనే వదిలేశారు. కొత్త ప్రభుత్వం మిగిలిన పనులను పూర్తి చేయించాలి.

– బందారపు బాల్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట

పరిశీలించి పూర్తి చేస్తాం

జిల్లాలోని మినీట్యాంక్‌బండ్‌లుగా మార్చడానికి ఎంపిక చేసిన చెరువులను పరిశీలించి మిగిలిన పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. గతంలో మంజూరైన నిధులు ఖర్చు చేసి పనులు చేపట్టాం. మిగిలిన పనులకు నిధుల అంచనాలను ప్రభుత్వానికి నివేదిస్తాం.

– సత్యనారాయణ, నీటిపారుదలశాఖ డీఈ

గుండెపోటుతో వ్యక్తి మృతి


వెంకటేశంగౌడ్‌ (ఫైల్‌)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన సుద్దాల వెంకటేశంగౌడ్‌ (40) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఉదయం హఠాత్తుగా గుండెపోటు రావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. వెంకటేశంకు భార్య స్రవంతి, ఇద్దరు కూతుళ్లు ఉండగా కొన్నేళ్లుగా అతడికి దూరంగా ఉంటున్నారు. మృతుడికి తల్లిదండ్రులు బాలయ్య, బాలలక్ష్మి, అక్క, తమ్ముడు ఉన్నారు.

పొలంవద్దే ఆగిన రైతు గుండె


బుచ్చిమల్లయ్య (ఫైల్‌)

రుద్రంగి(వేములవాడ): పొలం పనులు చేస్తుండగా గుండెపోటుతో రైతు మృతిచెందిన ఘటన ఆదివారం రుద్రంగి మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన నంద్యాడపు బుచ్చి మల్లయ్య (68) పొలంలో వరినాట్లు వేయిస్తున్నాడు. హఠాత్తుగా గుండెపోటు రావడంతో హఠాన్మరణం చెందాడు. అప్పటి వరకు పొలం పనులు చేస్తూ క్షణంలో బుచ్చిమల్లయ్య మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య నర్సవ్వ, కొడుకు తిరుపతి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు


పోలీసులు సీజ్‌చేసిన ఇసుక ట్రాక్టర్లు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): స్థానిక అవసరాలకు కాకుండా అనుమతులు లేకుండా ఇసుకను ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ను సీజ్‌ చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్‌ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సిరిసిల్లపై కేటీఆర్‌కు చిన్నచూపు

● కాంగ్రెస్‌ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్‌: పదిహేనేళ్లుగా సిరిసిల్ల ప్రాంతంపై మాజీ మంత్రి కేటీఆర్‌ సవతిప్రేమను ఒలకబోశారని కాంగ్రెస్‌ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. విలీన గ్రామాల అభిప్రాయాలను గౌరవించకుండానే మున్సిపల్‌లో కలిపిన కేటీఆర్‌ ఇప్పుడు జీపీలుగా మార్చుతామని మాయమాటలు చెబుతున్నాడని అన్నారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు సోయి ఏమైందని, ఇప్పుడు కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజల అభీష్టాన్ని కచ్చితంగా నెరవేర్చుతుందనే రాజకీయ కుట్రకు తెరలేపారని విమర్శించారు. బతుకమ్మ చీరలకు సంబంధించి వందలాది కోట్ల రూపాయలు ఇవ్వకుండా ఇక్కడి పరిశ్రమవర్గాలను మోసం చేసింది కేటీఆర్‌ కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ అమలు చేస్తామన్న ఆరుగ్యారంటీలపై ఎలాంటి శషభిషలు అవసరం లేదన్నారు. దోపిడీదారులు ఆటో డ్రైవర్లను తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి ఆటలు సాగనివ్వమన్నారు. వారి సమస్యలను తమ సర్కారు పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. సిరిసిల్ల మున్సిపాల్టీలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని, విలీన గ్రామాల ప్రజలకు కేటీఆర్‌ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజు, గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, ఎల్లె లక్ష్మీనారాయణ, మ్యాన ప్రసాద్, గోనె ఎల్లప్ప, జాలుగం ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు కోరిందే తీర్మానించాం

● సిరిసిల్ల మున్సిపల్‌ ఛైర్‌పర్సన్‌ జిందం కళ


మాట్లాడుతున్న జిందం కళ

సిరిసిల్లటౌన్‌: ప్రజాపాలన దరఖాస్తుల్లో పలు ఆప్షన్లను కోరారని వాటినే మున్సిపల్‌ ఎజెండాలో ఉంచి తీర్మానం చేశామని సిరిసిల్ల మున్సిపల్‌ ఛైర్‌పర్సన్‌ జిందం కళ అన్నారు. ఆదివారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమంపై భేషజాలకు పోకుండా పలు అంశాలపై ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలోనే రేషన్‌కార్డులు, ఉచిత విద్యుత్‌కోసం ప్రత్యేకంగా ఆప్షన్లు ఇవ్వాలని కోరామన్నారు. ఈవిషయాలను ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌ దృష్టికి కూడా తీసుకెళ్లామని వివరించారు. కానీ కాంగ్రెస్‌ నేత కేకే మహేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ నాయకులను కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అనంతరం బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ, విలీన గ్రామాలను జీపీలు చేస్తామని ఎమ్మెల్యే కేటీఆర్‌ ఎన్నికలకు ముందు బహిరంగ సభలో ప్రకటించారని పేర్కొన్నారు. రూ.వందల కోట్ల ఖర్చుతో బైపాస్‌రోడ్డు వేయించారని, మెడికల్, నర్సింగ్‌ కాలేజీలు ఏర్పాటు చేయించారని ఇవన్నీ విలీన గ్రామాల అభివృద్ధికి దోహదం చేసిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. వస్త్ర పరిశ్రమలో నేతకార్మికులు, పద్మశాలీలను పూర్తిస్థాయిలో కేసీఆర్, కేటీఆర్‌ ఆదుకున్నారని, కేవలం రాజకీయ లబ్ధికోసం వారిని ఇష్టానుసారంగా విమర్శించడం సరికాదన్నారు. సమావేశంలో టీఎస్‌పీటీడీసీ మాజీ ఛైర్మన్‌ గూడూరి ప్రవీణ్, సెస్‌ డైరెక్టర్‌ దార్నం లక్ష్మీనారాయణ, బొల్లి రామ్మోహన్, సత్తార్, వేణు, పూర్ణచందర్‌ తదితరులు పాల్గొన్నారు.

రేగొండలో ప్రమాదం.. వెన్నంపల్లిలో విషాదం


ప్రేమ్‌కుమార్‌(ఫైల్‌)

కాల్వశ్రీరాంపూర్‌(పెద్దపల్లి): భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో ఆదివారం తెలవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన ఈర్ల ప్రేమ్‌కుమార్‌(26) మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ప్రేమ్‌కుమార్‌ కరీంనగర్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు భాగ్యమ్మ, బక్కయ్య. చిన్న కుమారుడు ప్రేమ్‌కుమార్‌ మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఎదిగిన కొడుకు వివాహ చేసేందుకు సంబంధాలు చూస్తుండగా.. రోడ్డు ప్రమాదం ప్రాణాలు తీస్తుందనుకోలేదని కన్నీరుమున్నీరయ్యారు. 2023కు వీడ్కోలు పలుకుతూ.. 2024కు స్వాగతం చెప్పేందుకు సిద్ధమైన ప్రేమ్‌కుమార్‌.. కానరాని లోకాలకు వెళ్లడంతో స్నేహితులూ బావురుమన్నారు. వెన్నంపల్లిలో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మెట్‌పల్లిరూరల్‌: మెట్‌పల్లి మండలం మారుతీనగర్‌ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దాపూర్‌కు చెందిన సిద్ధు, మారుతినగర్‌కు చెందిన వంశీ గాయపడ్డారు. ఇద్దరూ కలిసి కోరుట్ల వైపు నుంచి మెట్‌పల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ప్రమాదం జరగడంతో కింద పడ్డారు. గాయపడిన ఇద్దరిని 108వాహనంలో మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో సిద్ధు పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

గీత కార్మికుడికి గాయాలు

రామగిరి(మంథని): రత్నాపూర్‌ గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముక్కెర లక్ష్మణ్‌ గౌడ్‌(50) తాటిచెట్టు పైనుంచి జారిపడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు.. కులవృత్తిలో భాగంగా ఆదివారం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తున్నాడు. మోకు జారికింద పడటంతో తీవ్రగాయాల పాలయ్యాడు. స్థానికులు గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని సర్పంచ్‌ పల్లె ప్రతిమ, ఎంపీటీసీ దర్ముల రాజసంపత్, ఉప సర్పంచ్‌ దుబ్బాక సత్యారెడ్డి, గౌడ సంఘం నాయకులు ముక్కెర సతీశ్‌ గౌడ్, కెక్కర్ల సమ్మయ్యగౌడ్‌ కోరారు.

పశువుల కొట్టం దగ్ధం

● రూ.4 లక్షల ఆస్తి నష్టం

రాయికల్‌: మండలంలోని బోర్నపెల్లిలో భారతపు లక్ష్మీనర్సయ్యకు చెందిన పశువుల కొట్టం ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. ఘటనలో 1400 గడ్డి కట్టలు, హార్వెస్టర్, ట్రాక్టర్‌ పనిముట్లు, కలప కాలిపోయింది. స్థానికులు జగిత్యాల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వాహనం సకాలంలో రాకపోవడంతో స్థానికులందరూ కలిసి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో మొత్తంగా రూ.4లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.


బోర్నపెల్లిలో కాలిపోయిన పశువుల కొట్టం

'దళితబంధు పథకంపై సమీక్షించాలి'

గంభీరావుపేట(సిరిసిల్ల): నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్‌ ప్రభుత్వం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంపై సమీక్ష నిర్వహించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం విజ్ఞప్తి చేశారు. దళితబంధు పథకాన్ని కొనసాగించాలని, ప్రతి కుటుంబానికి రూ. 15లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం దళితబంధు పథకం ద్వారా ఒక్కో నియోజకవర్గానికి భిక్ష వేసినట్లు వంద మందికి మాత్రమే ఇచ్చారని, రెండో విడతలో 1,100 మందికి ఇస్తామని చెప్పి చేతులెత్తేశారన్నారు. దళితబంధు పథకంలో బీఆర్‌ఎస్‌ అనుకూల వ్యక్తులకే ఇచ్చుకున్నారని ఆరోపించారు. త్వరలో సీఎంను కలిసి దళితుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఆయన వెంట ప్రేమ్‌కుమార్, బాబు, రఘు, దేవరాజు, నర్సింలు, రాజేందర్‌ తదితరులు ఉన్నారు.

వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని అనంతపల్లి–తడగొండ గ్రామ పరిసరాల్లో ఆదివారం రాత్రి బైక్‌ స్కిడ్‌ కావడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బూర్గుపల్లికి చెందిన అభి, బోయినపల్లికి చెందిన గణేశ్‌ బైక్‌పై అనంతపల్లి నుంచి తడగొండ వైపు వస్తున్నారు. తడగొండ గ్రామ పరిసరాల్లో బైక్‌ స్కిడ్‌ కావడంతో కిందపడ్డారు. ఈ ప్రమాదంలో అభి తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. గణేశ్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. ఇద్దరినీ చికిత్స నిమిత్తం 108 వాహనంలో కరీంనగర్‌ ఆసుపత్రికి తరలించారు. అభి తండ్రి లచ్చయ్య జీవనోపాధి నిమిత్తం సౌది వెళ్లాడు. తల్లి ఎల్లవ్వ కూలీ పని చేస్తోంది. గణేశ్‌ తండ్రి గతంలోనే మృతిచెందాడు. తల్లి కాంతమ్మ కూలీ పని చేస్తూ జీవనోపాధి పొందుతుంది.